విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 31, ఆగస్టు 2024

ఐకమత్యంతో జెఎన్‌టీయూను అగ్రస్థానంలో నిలుపుదాం

వీసీ సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని ఐక్యమత్యం తో ప్రగతి అగ్రస్థానంలో నిలుపుదామని ఇంచార్జి వీసీ ఆచార్య సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ ఆడిటోరియం లో యూనివర్సిటీ ఆవిర్భావ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ .. సాంకేతిక విద్య బోధన, పరిశోధన పరికరాలు, వినూత్న ఆవిష్కరణలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వనరుల వినియోగం, క్రీడా, సేవ స్ఫూర్తి నిలిచేలా కృషి చేయాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ.. పాఠ్యాంశాల లోని మూలాలను అన్వేషణ చేస్తూ.. పరిశోధాత్మక అధ్య యనం చేపట్టాలన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఒకే వృక్ష నీడలో నివసిస్తూ.. అభివృద్ధిలో పాలుపంచుకుందామని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నారెడ్డి మాట్లా డుతూ.. సదస్సులు, అధ్యాపకుల బోధనలు, విద్యార్థు లతో నిరంతరం పాఠ్యాంశాలపై అన్వేషణ చేపట్టడంతో విజయాలను సొంతం చేసుకోగలరు అన్నారు. వర్క్ షాపులు, గెస్ట్ లెక్చరర్లు, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్ర మాలలో గెలుపొందిన విద్యార్థులకు ఉపకులపతి, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ బహుమతులు సర్టిఫికెట్లు, అందజేశారు. ఓఎస్డి వీసీ ఆచార్య ఎన్. దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటడంతో రాష్ట్రానికే అనంత జిల్లా రోల్ మోడల్‌గా నిలుస్తుంది : కలెక్టర్

విశాలాంధ్ర-అనంతపురం: మొక్కలు నాటే కార్యక్రమంలో అనంతపురం జిల్లా రాష్ట్రానికే రోల్ మోడల్ నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో జంతలూరు, సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణలో వన మహోత్సవం-2024 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్.వి, ఎస్పీ జగదీష్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, డీఎఫ్ఓ వినీత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, వైస్ ఛాన్సలర్ సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఏ కోరి, ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచు ఫెర్రర్, జిల్లా అధికారులు మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షపాతం నమోదు, సాధారణ స్థాయిలో ఉందన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో చెట్ల పెంపకం చేయించామని, గ్రామీణ ప్రాంతంలో ఎన్ఆర్ ఈజీఎస్ కింద మొక్కల పెంపకం చేశామన్నారు. ఆర్డిటి సంస్థ వారు, రెడ్స్ సంస్థ, డిస్కవర్ అనంతపూర్ వారు కార్పొరేషన్ పరిధి లో చేస్తున్న కృషి అనిర్వచ నీయం అన్నారు. వీరంతా 40, 80 టన్నుల బరువున్న చెట్లను సైతం ఒకచోట నుండి మరొక చోటుకు తరలిస్తున్నారని, డిస్కవర్ అనంతపూర్ వారు ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నారని, పచ్చదనం కాపాడుకోవటం కోసం రెడ్ సంస్థ వారు కృషి చేస్తున్నారని, ఇందులో ఆర్డిటి గురించి మనం ఎంత చెప్పుకున్న తక్కువేనని, అన్నారు. ఇలాంటివన్నీ మన జిల్లాలో జరగటం రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఇంటి వద్ద ఒక చెట్టు అయినా నాటాలని కోరు కున్నారు. జిల్లాలో బౌండరీ ట్రెంచ్, ఫామ్‌ఫాండ్ లాంటివి ఏర్పాటు చేసి వచ్చిన వర్షం నీరు అక్కడే ఇంకిపోయేలా చేయొచ్చన్నారు.

విద్యార్థులతో కలెక్టర్ సహ పంక్తిభోజనం

విశాలాంధ్ర-శింగనమల: శింగనమల నియోజకవర్గం బుక్కరాయ సముద్రం మండలం రోటరీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేసుకుంటూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, ఎంపీడీఓ తేజోష్ణ, సమగ్ర శిక్ష అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర-యాడికి : యాడికిలో యువ కుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్ర వారం చోటు చేసుకుంది, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొండ కింద వీధికి చెందిన రాజశేఖర్ ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడని తెలిపారు, విషయం తెలుసు కున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల హృదయాలు గెలుచుకున్న పల్లె ఉమా..

అమృత మూర్తి ఆరవ వర్ధంతి- ప్రముఖుల ఘన నివాళులు

విశాలాంధ్ర- జెఎన్టియూఏ: అమృతమూర్తి పల్లె ఉమా.. ప్రజల సంక్షేమం, రాజకీయ జీవన ప్రయాణంలో వెన్నంటే ఉంటూ, విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపి అందరి హృదయాలను గెలుచుకున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, బాలాజీ విద్యా సంస్థల అధినేత కృష్ణకిషోర్, కోడలు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సతీమణి పల్లె ఉమా ఆరవ వర్ధంతి వేడుకలు అనంతపురం పట్టణంలోని పల్లె ఉమా ఘాట్ వద్ద ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, తనయుడు, శ్రీ బాలాజీ విద్యా సంస్థల ఛైర్మన్ పల్లె కిషోర్, కోడలు , పుట్టపర్తి ఎం.ఎల్.ఏ పల్లె సింధూరతో పాటు కుటుంబ సభ్యులు, యాజమాన్యం ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, రాజకీయ ప్రముఖులు, వేలాదిమంది పల్లె ఉమాకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ పల్లె ఉమా.. విద్యారంగంలో చేసిన సేవలను, పేద విద్యార్థులకు అందించిన విద్యా సహకా రాన్ని ఎప్పటికీ మరచిపోలేనన్నారు. ఆమె విధానం, విశ్వాసం నా జీవితానికి మార్గదర్శకమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందూపురం మాజీ ఎం.ఎల్.ఏ. అబ్దుల్ గనీ, సీపీఎం నాయకులు జగదీష్, అనంతపురం మాజీ మేయర్ మదమంచి స్వరూప, టీడీపీ సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, సింగనమల త్రిసభ్య కమిటీ సభ్యుడు కేశవ రెడ్డి, జేఎన్‌టీయూ అనంతపురం వైస్ ఛాన్సిలర్ ఆచార్య సుదర్శన్ రావ్, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఆచార్య క్రిష్ణయ్య, ఎస్ కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రమేష్ బాబు, మాజీ ఏపీ స్టేట్ కౌన్సిల్ ఉన్నత విద్యా మండలి మాజీ అధ్యక్షులు ఆచార్య హేమచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

చెట్లతో ఆరోగ్యం.. ఆహ్లాదం : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బిటిపి రోడ్డు లోని మోడల్ లేఅవుట్ నందు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పెంచే విధానాన్ని పాఠ్యాంశాలలో లేకపోయినప్పటికీ ఉపాధ్యా యులు విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. మనిషి అవసరాలను తీర్చే ప్రకృతి గురించి తెలియజేయాలన్నారు. మొక్కలు నాటడం ఒక ప్రత్యేకమైన యజ్ఞం అన్నారు. చెట్టు అనేది శివునితో సమానం అన్నారు. చెట్టు పెరిగితే ఆహ్లాదకరమైన వాతావరణం మనుషులకు కల్పిస్తుం దన్నారు. అనేక రోగాల నుండి కాపాడుతుందన్నారు. ఎన్డీఏ కూటమిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెట్లు పెంచే విధానాన్ని పెద్ద ఎత్తున బలోపేతం చేస్తున్నారు. పర్యావరణ అటవీశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా 50% పచ్చదనాన్ని పెంచాలనే నిబద్ధతతో పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మునిసిపల్‌శాఖ సిబ్బంది, అటవీ శాఖ జిల్లా అధికారి దామోదర్ రెడ్డి, అటవీశాఖ సిబ్బంది, టీడీపీ పట్టణ అధ్యక్షులు పసుపులేటి రాజు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

విశాలాంధ్ర-కళ్యాణదుర్గంటౌన్: మొక్కలు విరివిగా పెంచుదాం పర్యావర ణాన్ని కాపాడు దామని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని నగరవనంలో ఫారెస్ట్ అధికారులు, మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ మంచి పంటలు పండి రాష్ట్ర సుభిక్షంగా ఉండాలంటే మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ..

విశాలాంధ్ర-అనంతపురం: హరిత ఆంధ్ర ప్రదేశ్-వనం మనం వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆవరణలో డీఎంహెచ్ఓ ఈబి దేవి కార్యా లయ సిబ్బందితో మొక్కలు నాటించారు. ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి ఆ మొక్క సంరక్షణ కూడా స్వీకరించి హరిత అనంత,హరిత ఆంధ్రప్రదేశ్ కావడానికి కృషి చేయాలని కోరారు. పీహెచ్‌సీల ఆవరణలో మొక్కలు నాటాల న్నారు. డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమ, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్ రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీబీ జైనబ్బి ఉరుసు

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండలో హిందూ ముస్లింల ఐక్యతకి చిహ్నంగా నిలిచిన 'పాక్ దామన్ హజ్రత్ సయ్యదున్నీసా బీబీ జైనబ్బి రహంతుల్లా అలైహ' అమ్మవారి ఉరుసు భక్తిశ్రద్ధలతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు వైభవంగా జరిగింది. డప్పులు, మేళతాళాలు యువకుల నృత్యాల మధ్య స్వామి వారి షంషేర్‌ను గుర్రంపై ఉంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా జైనబ్బి దర్గా వద్దకు తీసుకొచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఉరుసు ఉత్సవా లకు రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తెలంగాణ నుండి వేలాదిగా వచ్చిన హిందు ముస్లిం భక్తులు అమ్మవారి సమాధిని దర్శించుకుని చద్దార్ సమర్పించారు. చక్కర, బెల్లం తులాబారం ఇచ్చి మొక్కులు చెల్లించు కున్నారు. రాత్రి ఖవ్వాలి పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-రాప్తాడు : విద్యార్థులు మత్తు పదా ర్థాలకు దూరంగా ఉండా లని సైకియాట్రిస్ట్ డాక్టర్ విశ్వనాథ్ సూచించారు. రాప్తాడు పీహెచ్ సీ డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో సైక్రి యాట్రిస్ట్ విశ్వనాథ్ శుక్రవారం రాప్తాడు జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాలు వ్యసనాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కోరారు. వ్యసనాలకు బానిసైతే కుటుంబాలను, జీవితాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబ శివుడు, సీహెచ్‌ఓ శివ ప్రసాద్, సూపర్వైజర్ అరుణ, ఏఎన్ఎం లీలావతి, ఆశా కార్యకర్తలు గాయత్రి, చంద్రకళ పాల్గొన్నారు.

దివంగత పరిటాల రవీంద్ర ఆశయాలను నెరవేరుద్దాం

-ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్..

విశాలాంధ్ర-రాప్తాడు: మాజీ మంత్రి, టీడీపీ నేత పరిటాల రవీంద్ర ఆశయాలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత ధర్మవరం టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలోని పరిటాల ఘాట్ వద్ద ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తమ కుటుంబ సభ్యులతో కలసి పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం అభిమానులు, వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు,పెద్దఎత్తున తరలివచ్చి నివాళులర్పించగా వెంకటాపురంలో సందడి వాతావరణం కనిపించింది. పరిటాల రవీంద్ర సోదరి ఉష ఘాట్ వద్ద మిఠాయిల పంపిణీ, అన్నదానం చేప్టటారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ తరఫున సేవా కార్యక్రమాలు నిర్వహిం చారు. గంగం పల్లి రెసిడెన్సియల్ స్కూల్ సెంటర్ వద్ద గరుత్మం తుని విగ్రహం ప్రారంభించారు. ఎంజేపీ రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థులకు 600 స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ రామమూర్తి నాయుడు రూ.50వేల వ్యయంతో త్రాగునీటి ఫ్రిజ్ అందజేశారు. మాజీ ఎంపిపి రంగయ్య సొంత నిధులతో స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా పరిటాల సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ రవి చనిపోయి ఇన్నేళ్లు అయినా ప్రజలు మాత్రం ఆయన్ని గుండెల్లో పెట్టుకున్నారన్నారు. ప్రతి జయంతి, వర్ధంతికి పెద్దఎత్తున తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారన్నారు. రాప్తాడు, ధర్మవరం నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమన్నారు. రవి చేపట్టిన సేవా కార్యక్రమాలు భవిష్యత్‌లో కూడా కొనసాగు తాయని స్పష్టం చేశారు.

సర్వీస్ రూల్స్ ప్రకారం పరిష్కారం చూపాలి

విశాలాంధ్ర-అనంతపురం : ఎస్పీ పి.జగదీష్ జిల్లాలోని పోలీస్ సిబ్బంది సమస్యల పరి ష్కారానికి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. బది లీలు, సస్పెన్షన్ రీటక్ ఇతర సమస్యలపై సిబ్బంది పిటీషన్లు అందజేశారు. సర్వీస్ రూల్స్ ప్రకారం పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి, జిల్లా పోలీసు కార్యాలయం ఏ.ఓ శంకర్, బి.సూపరింటెండెంట్ ప్రసాద్, ఎస్పీ సిసి ఆంజనేయ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ క్రాప్ చేయించుకోండి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ

విశాలాంధ్ర-శెట్టూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లలో పంటలు సాగు చేసిన రైతులు సెప్టెంబర్ 15లోపు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వ రమ్మ సూచించారు. శుక్రవారం చిన్నం పల్లి గ్రామంలో జరుగుతున్న ఈక్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలంలో వర్షధారంగా, బోరు బావులు క్రింద సాగు చేసిన పంటల అయిన ఆముదం, కంది, వేరుశెనగ వరి, టమోటా ఇతర పంటలను పరిశీలించారు. సాగైన పంటల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ఇంచార్జి వ్యవసాయ అధికారి ఆర్‌డి. జగదీష్‌బాబు, ఏఈఓ ఆంజనేయులు, వీఆర్ఓ మూర్తి ఆర్.బి.కె సిబ్బంది రమణ, అరవింద్ హాజరయ్యారు.

హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-అనంతపురం: విద్యార్థి దశ నుంచి హెచ్ఐవి ఎయిడ్స్ మరియు ఇతర రోగాల పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డా. అనుపమ జేమ్స్ అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు స్థానిక రాజేంద్ర మున్సిపల్ హై స్కూల్‌లో నిర్వహించారు. యూత్ ఫెస్ట్ 2024-25లో భాగంగా మండల స్థాయిలో 8,9వ తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ప్రథమ విజేతలుగా సర్వే పల్లి రాధకృష్ణ మున్సిపల్ హైస్కూల్, గుంతకల్ విద్యార్థిని నందిత మరియు ఎస్.జె.పి.హై స్కూల్, గుంతకల్ విద్యార్థిని మధిహా ఇమాన్, ద్వితీయ స్థాయి విజేతలుగా ఏపీ మోడల్ స్కూల్, పామిడి విద్యార్థులు మహీదర్, సంపత్ కుమార్, తృతీయ స్థానంలో డా.అంబేద్కర్ గురుకులం, కొర్రపాడు విద్యార్థినులు శిరీష, భవిష్య గెలుపొందారు. నగదు బహుమతులు ప్రసంశ పత్రాలు అందజేశారు. ప్రథమ, ద్వితీయ విజేతలు 6 సెప్టెంబరు 2024 న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉప జిల్లా విద్యాధికారి శ్రీనివాస రావు,క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వి.బాస్కర్, జిల్లా సూపర్వైజర్ జి.వి.రమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో లంచాలు తీసుకుంటే ఖబర్దార్

అనంతపురం డీ.సీ.హెచ్.ఎస్. పాల్ రవికుమార్ ..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పేదలకు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని ఏ సేవలకైనా ఆసుపత్రి సిబ్బంది కానీ, డాక్టర్లు కానీ డబ్బు డిమాండ్ చేస్తే ఏసీబీ కి పట్టించాలని డిసిహెచ్ ఎస్ పాల్ రవికుమార్ సూచించారు. శుక్రవారం కళ్యాణదుర్గం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ 50 పడకల ఆసుపత్రిలో నాడు నేడు భవన నిర్మాణాల పరిశీలన చేశారు. అసంపూర్తిగా ఆగిపోయిన భవన నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, డాక్టర్ల కొరత కొంత ఉన్నప్పటికీ స్థానిక ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నా మని తెలిపారు. ఖాళీగా ఉన్న వైద్యులు,, స్టాఫ్ నర్స్ పోస్టులను జిల్లా, రాష్ట్రస్థాయి రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా భర్తీ చేపడతామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాతాశిశు సంక్షేమ సేవలు, సాధారణ డెలివరీ, బటన్ హోల్ ఆపరేషన్లు, సిజేరియన్ ఆపరేషన్లకు సదుపాయాలు కల్పిస్తా మన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా మందుల కొరత లేకుండా చూస్తున్నామన్నారు.. దేశంలో వైద్యులపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని కళ్యాణదుర్గం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో కూడా సెక్యూరిటీని పెంచుకోవాలని, రాత్రిళ్ళు వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు అమర్చుకోవాలని సీసీ కెమెరాలు అందుబాటులో ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. ఆసుపత్రి చుట్టూ ప్రహరీ శిథిలమైపోయిందని, పోస్టుమార్టం గది పాడైపోయిం దని సీజనల్ వ్యాధులకు మందుల కొరత ఉందని మీడియా ప్రతినిధులు డీసీహెచ్ఎస్ దృష్టికి తీసుకెళ్లగా వీటన్నింటినీ ఎమ్మెల్యే డిఎం హెచ్ఓ దృష్టికి తీసు కెళ్లి సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

60 నెలల వేతనం ఇవ్వలేదయ్యా..!!

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : 60 నెలల పాటు నిత్యం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల కు సేవలందించిన తనకు వేతనం ఇవ్వలేదని శానిటేషన్ వర్కర్ అరుణ డిసి హెచ్ ఎస్ పాల్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. తన తండ్రితో కలిసి ఆసుపత్రికి వచ్చిన ఆమె పాల్ రవికుమార్ ఎదుట తన గోడు వినిపించారు. 2015-22 మధ్యకాలంలో తాను శానిటేషన్ వర్కర్‌గా పనిచేశానని, రెండేళ్లపాటు వేతనం ఇచ్చి... మిగిలిన 5 ఏళ్ల పాటు నెలనెలా వేతనం ఇవ్వలేదని వాపోయింది. స్పందించిన డీసీహెచ్ఎస్ స్థానిక మెడికల్ ఆఫీసర్‌ను అరుణకు అందించాల్సిన 60 నెలల వేతనం అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తనను ఉద్యోగిగా గుర్తించి కొనసాగించాలని ఆమె వేడుకుంది. జిల్లా వైద్యాధికారి, ఆసుపత్రి నూతన కమిటీ సభ్యులతో చర్చించి న్యాయం చేస్తామని డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్ హామీ ఇచ్చారు.

గురుకుల పాఠశాల దరఖాస్తుకు గడువును పెంచాలి..

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: అనంతపురం జిల్లా గురుకుల పాఠశాల 2024 - 25 విద్యా సం. ఐదవ తరగతి నుండి 8వ తరగతి వరకు 129 అదనపు భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆమోదం లభించింది అయితే.. దరఖాస్తు గడువును పొడిగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.కుల్లాయి స్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు చేసుకునేందుకు రెండు రోజులు గడువు ఇవ్వడం వల్ల విద్యా ర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొన్నది అన్నారు. స్టడీ, క్యాస్ట్, సర్టిఫికెట్ గ్రామ సచివాలయంలో నాలుగు రోజులు, స్టడీ సర్టిఫికెట్ ఒక రోజు పడుతుందని విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ దరఖాస్తు గడువును పొడిగించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందించుకోవాలి

- నగర మేయర్ మహమ్మద్ వసీం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: విద్యార్థి దశ నుండే పర్యా వరణ పరిరక్షణ పట్ల అవగా హన పెంపొందించుకోవా లని నగర మేయర్ మహ మ్మద్ వసీం సూచించారు. నగరంలోని రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మేయర్ మహమ్మద్ వసీం,డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ లీలావతితో కలసి మొక్కలు నాటారు. మేయర్ వసీం మాట్లాడుతూ కరోనా విపత్తు ఆక్సిజన్ ఆవశ్యకతను మానవాళికి తెలియచేసిందన్నారు. భవిష్యత్ తరాలకు ఆ పరిస్థితి ఉత్పన్నం కాకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, బాలాంజినేయులు, లాలూ, కమల్ భూషణ్, అభూ సాలెహా, ప్రధానోపాధ్యా యులు రామానుజులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ ఎస్సైగా నబిరసూల్



విశాలాంధ్ర-బొమ్మనహళ్: బొమ్మనహాల్ మండల ఎస్సైగా నబిరసూల్ శుక్రవారం బాధ్య తలు చేపట్టారు. గతంలో ఎస్సైగా పనిచేస్తున్న శ్రీనివాసులు కర్నూలు జిల్లా నందవరంకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో గుత్తిలో ఎస్ఐగా పనిచేస్తున్న నబిరసూల్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇటీవల ఎస్పీ జగదీష్ జారీ చేశారు.

రాయితీతో ఉలవలు, కొర్రలు..

విశాలాంధ్ర-యాడికి : ఉలవలు, కొర్రలు 80 శాతం రాయితీతో రైతు లకు మాత్రమే ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ కార్డు తీసుకొని రైతు సేవ కేంద్రంలో ఖరీఫ్‌లో పంట వేయలేదని స్వీయ ధృవీకరణ పత్రంతో విత్తనాలు పొందొచ్చు. ఉలవలు 10 కేజీల బస్తా పూర్తి ధర రూ.870, 10 కేజీల బస్తా రాయితీ రూ.696/-10 కేజీల బస్తా రైతు కట్టవలసింది రూ.174 కొర్రలు 2 కేజీల బస్తా పూర్తి ధర రూ.174.8, 2 కేజీల బస్తాకు రాయితీ రూ.139.84, 2 కేజీల బస్తాకు రూ.34.96 రైతులు ఈ సదవకాశాన్ని వినియో గించుకోవాలని వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలిపారు.

రైతుకు జరిగిన అన్యాయంపై జాతీయ రహదారిపై నిరసన ..

విశాలాంధ్ర-శింగనమల : మండలంలోని మరువ కొమ్మ వద్ద జాతీయ రహదారిపై కూర్చొని తనకు న్యాయం చేయాలని రైతు విజయ భాస్కర్ రెడ్డి నిరసన తెలిపారు. తన పొలం వద్ద జాతీయ రహదారి రోడ్డు నిర్మాణ గుత్తేదారులు మోరి నిర్మించడంతో కొండపై నుంచి వస్తున్న నీరు శింగనమల చెరువులోకి వెళ్లకుండా తన తోటలోకి వస్తుందని, గతంలో తన తోట పక్కనే ఉన్న చిన్న కాలువను కొందరు మట్టితో పూడ్చి వేశారని. రెవిన్యూ అధికారులు. రోడ్డు నిర్మాణ సంస్థ అధికారులు చుట్టూ ఎన్నిసార్లు తిరిగిన న్యాయం జరగలేదని, అందుకే రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు తెలిపారు

కనీస వేతనం అమలు చేయాలి..

విశాలాంధ్ర-తాడిపత్రి: స్థానిక సిపిఐ కార్యాల యంలో శుక్రవారం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టి.రం గయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాడికిలోని రాయలచెరువు ప్రాంతంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువ శాతం మంది శుద్ధ ఫ్యాక్టరీలలో అరకొర వేతనాలతో పనిచేయుచున్నారు. వారికి వచ్చే వేతనాలతో కుటుంబాలు గడవక, పిల్లల చదువుల ఫీజులు చెల్లించలేక, తీవ్ర దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఫ్యాక్టరీల్లో వచ్చే శుద్ధ పొడరు గ్రేడింగ్ విధానంతో మూడు విభాగాలుగా విభజించి ఫ్యాక్టరీ యాజమాన్యం అధిక లాభాలు గడిస్తున్నా ఫ్యాక్టరీ పనిచేసే కార్మికులకు మాత్రం అతి తక్కువ వేతనం ఇస్తున్నారు. శుద్ధ ఫ్యాక్టరీల్లో దూళి వల్ల అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. కానీ ఫ్యాక్టరీ యాజమాన్యాలు కార్మికులను పట్టించు కోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీటి. రామాంజనేయులు సిపిఐ మండల కార్యదర్శి నాగ రంగయ్య ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు యాదవ్, ఉమా గౌడ్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 31, ఆగస్టు 2024

పర్యావరణాన్ని అందరూ కాపాడాలి..

- పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలి

మంత్రి సవితమ్మ

విశాలాంధ్ర-పెనుకొండ : పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పెనుకొండలోని సామాజిక అటవీ వన విభాగం ఆధ్వర్యంలోపులేకులమ్మ గుడి సమీపాన మంత్రి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ టీఎస్ చేతన్. జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వన మహొత్సవం నిర్వహించాలని ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టామని, జిల్లాలో 21 శాతం మాత్రమే పచ్చదనం ఉందని మొక్కల కార్యక్రమంతో 50 శాతానికి పెంచుకోవాలని హితవు పలికారు. ప్రతిఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లి రోజు, తదితర కార్యక్రమాలకు మొక్కలు నాటాలన్నారు.

కానుగ, వేప, రావి, చింత, ఉసిరి, శ్రీగంధం, మర్రి, అశోక, రేలా, దిరిసెం మారేడు, నేరేడు, దేవకాంచన, తెల్ల మద్ది, మామిడి, కదంబం, జమ్మి, సీత అశోక, వెలగ, సీతా ఫలం వంటి అందరికీ ఉపయోగపడే మొక్కలను పెంచుదామని పిలుపునిచ్చారు. పులెకమ్మ సమీపంలోని అడవి ప్రాంతంలో ఐదు హెక్టార్ల అడవి స్థలంలో యోగా సెంటర్, ఫుడ్ కోర్టు,పార్కు ఆఫీసు, బాత్రుం,చిల్డరన్ ఎరియ, ఓపేన్ జిమ్, వాకింగ్ పాత్, ఇంటర్నల్ రోడ్స్ ఏర్పాటు చేస్తున్నామని, దాదాపు రెండు కోట్లతో ఈ పార్కు నిర్మిస్తున్నామని, 2025 మార్చి నాటికి పూర్తి అందుబాటులో ఉంటుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సామాజిక అటవీ మన విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో 25 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని, నవంబరు వరకు జరుగుతుందన్నారు. భోగసముద్రం వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో భోగసముద్రం చెరువు వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంత్రి చేపట్టారు.

రాంపురం వద్ద మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ త్వరలో రాంపురంలో రానా బీఈడీ కాలేజీలో మహాత్మ రావు జ్యోతి పూలే గురుకుల పాఠశాలను సెప్టెంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. సొంత గ్రామానికి ఏదైనా చేయాలని సంకల్పంతో కష్టపడి ముఖ్యమంత్రిని ఒప్పించి గురుకుల పాఠశాలను మంజూరు చేయించినట్లు చెప్పారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేయండి

- మంత్రికి వినతిపత్రం అందించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వేమయ్య

విశాలాంధ్ర-కదిరి : సత్యసాయి జిల్లాలో పలు గ్రామాల్లోని నిరు పేదలకు ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చెయ్యాలంటూ రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణతో కలసి వినతిపత్రం అందజేశామని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కదిరి మున్సిపాలిటీలో సర్వేనెంబర్ 83/1లో ప్రభుత్వ భూమిలో దాదాపు 200 మంది, తనకల్లు మండలం బొంతల పల్లి గ్రామ సర్వే నెంబర్ 183లో ప్రభుత్వ భూమి గయాలులో రెండేళ్ల నుంచి, ఓడీ చెరువు మండలం ఇనుగలూరు గ్రామ పంచాయితీ సర్వే నెంబర్ 383/3లో వంద కుటుంబాలు రెండేళ్లుగా గుడిసెల్లో జీవిస్తున్నట్లు తెలిపారు. అలాగే హిందూపురం పట్టణంలో సర్వే నెం 404-1లో పోరంబోకు భూమిలో పేదలు గుడిసెల్లో నివాసం ఉన్నారని తెలిపారు. సోమందేపల్లి మండలం పందిపర్తిలో సర్వే నెంబర్ 384,340లో 50కుటుంబాలు నివాసంలో ఉన్నారన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెల సర్వే నెంబర్ 224/1,633/1లో 150 కుటుంబాలు ఇళ్లు లేని పేదలకు పట్టాలు మంజూరు చెయ్యాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు.

రెడ్ క్రాస్ హాస్పిటల్ నిర్మాణానికి స్థల పరిశీలన

విశాలాంధ్ర-గోరంట్ల : బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిలోని గోరంట్ల మండలంలోని పాల సముద్రం క్రాస్ వద్ద జాతీయ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో హాస్పిటల్ నిర్మాణం చేపట్టడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి గ్రీన్ సిగ్నల్ రావడంతో శుక్రవారం పాలసముద్రం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పాలసముద్రం గ్రామం పొలంలో సర్వే నంబర్ 130-3లో 4.52 భూమిని జాతీయ రెడ్ క్రాస్ సంస్థ హాస్పిటల్ నిర్మాణం కోసం మంత్రి ఎస్ సవిత ,మరియుసత్య సాయి కలెక్టర్ టిఎస్ చేతన్, జిల్లా బీజేపీ అధ్యక్షులు జిఎం శేఖర్‌లు స్థల పరిశీలించారు. అలాగే గోరంట్ల మండల ఇన్చార్జి తహసీల్దార్ రెడ్డిశేఖర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ సోమశేఖర్ రెడ్డిలు భూమికి సంభందించిన వివరాలను తెలియ జేశారు. చైర్మన్ జిఎం. శేఖర్ మాట్లాడుతూ కోరిన వెంటనే సంస్థకు స్థలం కేటాయించడం పట్ల రెవిన్యూ సిబ్బందికి రెడ్‌క్రాస్ సంస్థ తరఫున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు బొట్టు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జే ఆర్ సిల్క్స్ ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోండి

- జౌళి శాఖ మంత్రి సవితకు, హ్యాండ్లూమ్ కమిషనర్‌కు సిపిఐ నాయకుల ఫిర్యాదు

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణ పరిధిలోని జేఆర్ సిల్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో రిజర్వేషన్ ఉలంఘిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ జౌళీ శాఖ మంత్రి సవితకు, హ్యాండ్లూమ్ కమిషనర్ కు సిపిఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చేనేత రిజర్వేషన్ చట్ట నిబంధనలకు విరుద్ధంగా జేఆర్ సిల్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ పనిచేస్తుందని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి విచ్చలవిడిగా పవర్ రూమ్లో పట్టుచీరలు తయారు చేస్తున్నారని, రిజర్వేషన్ చట్టాన్ని కాపాడాల్సిన ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి చేనేత కార్మికుల కష్టానికి శాపంగా మారడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే పట్టణంలో చేనేత కార్మికులు గిట్టుబాటు ధర లేక పెరిగిన ధరలతో కుటుంబాన్ని పోషించుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆత్మహత్యలన్నీ కూడా జౌళీ శాఖ ఎన్ఫోర్స్మెంట్ నిఘా వైఫల్యమే అని మండిపడ్డారు. ఇప్పటికే ఒకే బిల్డింగులో నోరు అంటే 200 పవర్లూమ్స్ మగ్గాలు నడుపుతున్నారంటే అధికార యంత్రాంగం ఎంతవరకు వైలేషన్ అడ్డుకున్నారు అనేది అర్థమవుతున్నదని తెలిపారు. చేనేత బకాసులను వదిలి ఒకటి రెండు పవర్ లూమ్స్ మగ్గాలు నిర్వహిస్తున్న యాజమాన్యంపై కేసులు పెట్టడం తూతూ మంత్రంగా చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చేనేత రిజర్వేషన్ అమలు కానివ్వకుండా అడ్డుకుంటున్న బడా బాబులపై ఎలాంటి కేసులు నమోదు చేయకపోవడం పై అధికారులు శీతకన్ను చూపిస్తున్నారనేది దీనికి నిదర్శనం అని తెలిపారు. 2019 లేబర్ యాక్ట్ నిబంధనలో ఫ్యాక్టరీలో అదే ప్రాంతానికి చెందిన 80 శాతం మంది కార్మికులు ఉండాలని ఉన్నప్పటికీ, ఆ యాజమాన్యం చెత్త విరుద్ధంగా పవర్లూమ్స్‌లో పట్టు చీరలు నేస్తున్న విషయాన్ని బయటకు వస్తుందని ఉద్దేశంతో ఇతర రాష్ట్రాల కార్మికులను అక్కడ పని కల్పించారని అని తెలిపారు. ఇప్పటికైనా జెఆర్ సిల్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిటాల రవీంద్రకు ఘన నివాళులు

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర 66వ జయంతి వేడుకలను ధర్మవరం పట్టణం గాంధీనగర్ వద్దగల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పరిటాల రవీంద్ర తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. పరిటాల రవీంద్ర వ్యక్తి కాదని ఒక శక్తి అని ఆయన బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశాడని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ పాలనలో ఉన్న అరాచక శక్తులను పీచమనచి ప్రత్యర్థులకు సింహ స్వప్నంలా మారాడని అన్నారు. ఈసందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పార్టీ కార్యకర్తల కోసం తన ప్రాణాన్ని సైతం తృణప్రాయంగా అర్పించిన మహొన్నతమైన వ్యక్తి పరిటాలరవీంద్ర అని తెలిపారు. ఆయన చూపిన అడుగుజాడలలోనే ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో పరిటాల రవీంద్ర ఆశయాలను ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. అనంతరం ఆ మహనీయుని పుట్టినరోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ప్రధాన కూడళ్లలో అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కమతంకాటమయ్య, పరిశేసుధాకర్, పణి కుమార్, మద్దిలేటి, బీరేగోపాలక్రిష్ణ పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, భీమనేని ప్రసాదానాయుడు, మాధవరెడ్డి, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, అత్తర రహీం, జింకల రాజన్న, చీమలరామాంజి, తిరుపాల్, క్లస్టర్ రామాంజి, అంకన్న, కరెంటు ఆది, పల్లపురవి, బీరేశ్రీరాముల పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తానని యువతకు కుచ్చుటోపీ..

- దాదాపు 20 మందికి లక్షల్లో మోసం చేసిన ఉపేంద్ర
- టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన బాధితులు

విశాలాంధ్ర-ధర్మవరం : కడప జిల్లా పత్తికొండ మండలానికి చెందిన వడ్డే ఉపేంద్ర కొన్ని నెలలుగా నిరుద్యోగులకు ఎరవేసి లక్షలు కాజేసిన వైనం, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెలితే.. వడ్డే ఉపేంద్ర బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసుకొని, కొన్ని నెలలుగా తిరుపతి తదితర ప్రాంతాలలో సూటు బూటు వేసుకొని నిరుద్యోగులకు ఎరవేస్తూ లక్షల్లో వసూలు చేశాడు. ఇతని కోసం దాదాపు 20 మంది నిరుద్యోగులు గత ఆరు నెలలుగా వెతకసాగారు. ఇందులో భాగంగా ధర్మవరం పట్టణం మారుతీనగర్‌కు చెందిన నరేష్ బీటెక్ విద్యార్థి, ఉపేంద్రతో గత కొన్ని నెలల కిందట పరిచయమయ్యాడు. తదుపరి నిరుద్యోగులను నమ్మబల్కుతూ, మోసపూరిత మాటలతో నిరుద్యోగులను వలలో వేసుకున్నాడు ఉపేంద్ర. చివరకు నరేష్ ఊరు అయినా పత్తికొండకు కూడా వెళ్లి రావడం జరిగిందని, అక్కడ కూడా లేకపోవడంతో తాను ఉపేంద్రకు దాదాపు ఒకటిన్నర లక్ష రూపాయలు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి, ఫోన్ పే ద్వారా ఇచ్చాడు. తాను మోసపోయానని ఆలస్యంగా తెలుసుకున్న నరేష్, ఉపేంద్ర కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ధర్మవరం రైల్వే స్టేషన్లో గురువారం రాత్రి అనుకోకుండా ఉపేంద్ర కనపడడంతో తన కుటుంబ సభ్యులతో ఉపేంద్రను పట్టుకొని డబ్బు ఇవ్వాలని కోరారు. స్పందన లేకపోవడంతో రైల్వే పోలీసుల దగ్గరకు వెళ్లగా వారి సలహా మేరకు నిందితుడిని కుటుంబ సభ్యులతో కలిసి టౌన్ పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. పత్తికొండలో తల్లిదండ్రులకు తెలియకుండా రూ.5 లక్షలు అప్పులు చేసి, ఆరు నెలలుగా తిరుగుతున్నా డని తెలిపారు. నరేష్ మాట్లాడుతూ తనతో పాటు 20 మందికి పైగా నిరుద్యోగులను మోసం చేశాడని తెలిపాడు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

గర్భిణులు తప్పనిసరిగా వైద్యుల సలహాలు పాటించాలి..

విశాలాంధ్ర-ధర్మవరం: గర్భిణీ స్త్రీలు అందరూ వైద్యుల సలహాలతో పాటు జాగ్రత్తలు కూడా తప్పక పాటించాలని డిప్యూటీ డిఎంహెచ్వో సెల్వియా సాల్మన్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు తల్లం నారాయణమూర్తి, కార్యదర్శి చిన్నప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని దుర్గానగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేశారు. విరాళ దాతగా చిన్నప్ప వ్యవహరించారు. డిప్యూటీ డీఎంహెచ్వో మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తినిస్తాయని తెలిపారు. గర్భిణీ స్త్రీలు మంచి వైద్య చికిత్సలతో పాటు ఆందోళన కలిగించే విషయాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి చంద్రిక, కంటి వైద్యాధికారి ఉరుకుందప్ప, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షులు జింక చిన్నప్ప, సంయుక్త కార్యదర్శి మంజునాథ్, సంస్థ సిబ్బంది వేణుగోపాల్ రామకృష్ణ మనోహర్ గుప్తాచంద్రశేఖర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర-కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. పూజలో పాల్గొన్న మహిళలకు దేవస్థానంతరుపున పసుపు, కుంకుమ, తమల పాకులు, వక్కలు, ఇస్తరాకు, టెంకాయలు, అగర బత్తీలు, దీపాంతులు, వత్తులు, నూనె, జాకిట్టు,గాజులు,పూలు, పూర్ణంబూరెలు అందచేసి ప్రధాన అర్చకులు ఎ.డి.పార్థసారధి చార్యులచే సామూహిక వరలక్ష్మి వ్రత సంకల్ప శాస్త్రనియామల ప్రకారం పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాస రెడ్డి, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

మహనీయుడు పరిటాల రవీంద్ర..

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి సర్కిల్లో శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, పరిటాల రవీంద్ర ఆశయాలను పరిటాల శ్రీరామ్ ముందుకు తీసుకువెళ్తున్నాడని పేర్కొన్నారు. క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర, బాలిక ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కర్ణం ప్రభాకర్, రమేష్‌బాబు, తుమ్మల మనో హర్, తుమ్మల సూరి, కోట్లబాబి, చికెన్ తిరుపాల్ కొలసాని చంద్ర పాల్గొన్నారు.

ఎంపీడీఓకు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-కదిరి: కదిరి మండల అభివృద్ధి అధికారి అంజినప్పకు పలువురు అభినందనలు తెలియజేశారు. ఆగస్టు 15 ఉత్తమ మండల అభివృద్ధి అధికారిగా మంత్రి సవితమ్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా జడ్పిటిసి రాధాబాయి, ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది కలిసి పూలమాలలు, శాలువా కప్పి సన్మానించారు. ఉత్తమ ఎంపీడీవోగా ప్రభుత్వం నన్ను గుర్తించి అవార్డు అందించడంతో తన బాధ్యత మరింత పెరిగిందని అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకొని మండల అభివృద్ధికి తోడ్పడతానని ఎంపీడీవో తెలిపారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పెనుకొండ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, పెనుకొండ ఆధ్వర్యంలో జిల్లాలో వున్న నిరుద్యోగ యువతీ యువకుల కోసం 3వ తేదీ పెనుకొండ పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో జాబ్ మేళా ఏర్పాటు చేశామని, కళాశాల ప్రిన్సిపల్ కేశవ రావు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ ఆధ్వర్యంలో జరుగుతుందని మంత్రి సవితమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో 6 కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని 10వ తరగతి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ,పూర్తి చేసి 18 నుంచి 35 వయసు లోపు ఉన్న వారు అర్హులు అని తెలియజేశారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల జీతం ఉంటుందన్నారు. సత్యసాయి జిల్లా అనంతపురం జిల్లాలో, హైదరాబాద్ బెంగళూరులో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకి హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ కె.శివప్రసాద్‌ను 9676706976లో సంప్రదించాలన్నారు.

పట్టపగలే మహిళ గొంతునులిమి గొలుసు, కమ్మలు అపహరణ..

విశాలాంధ్ర-రొళ్ల : మండల పరిధిలోని గిడ్డబొమ్మనహళ్లి గ్రామంలో తిమ్మమ్మ అలియాస్(తిమ్మమణి) తన పొలంలో పశువులకు మేత కోస్తుండగా శుక్రవారం పట్టపగలు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి గొంతు నులిమి మెడలోని బంగారు చైనుతో పాటు రెండు చెవుల కమ్మలను లాక్కొని పరారయ్యారు. బాధితురాలి రెండు చెవులు గాయలై తీవ్ర రక్తస్రావం కాగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స పొంది మెరుగైన వైద్య చికిత్సల కోసం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మడకశిర సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజకుమార్, రొళ్ల సబ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

పేదలకు కంటి వెలుగు ప్రసాదిస్తాం..

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే మా లక్ష్యమని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ కార్యదర్శి నాగభూషన తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సాంస్కృతిక మండలిలో సెప్టెంబర్ నెల 8వ తేదీ ఆదివారం నిర్వహించబడే ఉచిత కంటి వైద్య శిబిరం కరపత్రాలను ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. క్యాంపు చైర్మన్‌గా రామకృష్ణ వ్యవహరిస్తారని, బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే ఉచితంగా కంటి ఆపరేషన్లను నిర్వహించి భోజన సదుపాయాలు రవాణా సౌకర్యం కూడా ఉచితమని తెలిపారు. ఆపరేషన్ అయిన తర్వాత అద్దాలు కూడా ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆత్మహత్యకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలి

పోలీస్ స్టేషన్ వద్ద బాధితుల ధర్నా

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కురుబ శ్రీరాములు(40) గురువారం రాత్రి తన ఇంటిలోనే భయభ్రాంతులకు గురై ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు.. మృతుడు గొర్రెలను పెంచుకొని కుటుంబాన్ని పోషించుకునే వారు. శుక్రవారం ఉదయం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చెట్లు ఆకులను మేక పిల్లలకు తీసుకొని వస్తుండగా ఆ పాఠశాలలో ఎస్సీ కాలనీకి చెందిన ఒక మహిళ స్వీపర్ తనపై అత్యాచార యత్నానికి గొర్రెల కాపరి పాల్పడ్డారని, కుటుంబ సభ్యులకు బంధువులకు తెలిపింది. వారు ఎలాంటి విచారణ నిర్వహించకుండా గొర్రెల కాపరి ఇంటిపైన రాళ్లతో దాడికి పాల్పడి నిన్ను చంపుతామని బెదిరించారు. దీనితో ఆయన భయభ్రాంతులకు గురై తన ఇంటిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం కొత్తచెరువు పోలీసులకు తెలియడంతో సంఘటన స్థలానికి సిఐ ఇందిరా పరిశీలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసింది. మృతుని భార్య భారతి కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులు కలిసి శుక్రవారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఆయన ఆత్మహత్యకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి వారిని శిక్షించాలన్నారు. ఈ విషయంపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిఐని వారు నిలదీశారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఇక్కడ నుండి కదిలేది లేదన్నారు. జరిగిన సంఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపించి న్యాయం చేయాలని వారు కోరారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దివంగత నేత పరిటాల సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-పెనుకొండ: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన దివంగత నేత పరిటాల రవి ఆశయ సాధనకు కృషి చేద్దామని రాష్ట్ర బీసీ, సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామంత్రి ఎస్ సవిత పిలుపునిచ్చారు. పరిటాల రవి జయంతి సందర్భంగా శుక్రవారం స్థానికంగా ఉన్న అన్న క్యాంటీన్‌లో ఆయన చిత్ర పటానికి మంత్రి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, పరిటాల రవి తన జీవితాన్ని పేదల కోసం ధారపోశారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన దివంగత నేత పరిటాల రవి ఆశయ సాధనకు అందరమూ ఐక్యంగా కృషి చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న వైద్యులతో మంత్రి సవిత మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అంటురోగాలు ప్రబలుతున్నాయని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తండ్రికి తగ్గ తనయుడు లెజెండ్ బాలయ్య బాబు...

50 వసంతాల సంబరాలు జరుపుకున్న టిడిపి శ్రేణులు

విశాలాంధ్ర-హిందూపురం : పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో గల ఎం.ఎల్.ఎ కార్యాలయంలో శుక్రవారం సినీ రంగంలో నటుడుగా, నందమూరి బాలకృష్ణ 50 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం తెలుగు తమ్ముళ్లు, నందమూరి అభిమానులు కేక్‌కట్ చేసి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. నాయకులు మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ హీరోగా, విభిన్న పాత్రలు పోషించి తాను నటించిన పాత్రలకు ప్రాణం పోసి అందరితో జైరా అనిపించుకున్నారని కొనియాడారు. అందుకే ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా లక్షల్లో అభిమానులు ఉన్నారన్నారు. 50 సంవత్సరాల ప్రస్థానంలో బాలయ్య బాబు అనేక జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో నటించి సినీరంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించి తండ్రి నందమూరి తారక రామారావు తగ్గ తనయుడిగా సినీరంగంలో పేరు తెచ్చుకోవడం అందరికి గర్వకారణం అన్నారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో నందు ఆర్ ఎం ఎస్. షఫీ ఆధ్వర్యంలో బాలకృష్ణ చిత్రపటానికి పలాభిషేకం చేసి, అనంతరం కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు, పట్టణాధ్యక్షులు ఢీఈ. రమేష్‌కుమార్, నాయకులు నాగరాజు, రాష్ట్ర కార్యదర్శులు రామంజినమ్మ, పరిమళ, తెలుగుదేశం పార్టీ నాయకులు అశ్వర్థరెడ్డి, భాస్కర్, అమర్నాత్, భేవనహళ్లి ఆనంద్, వెంకట రమణ, అబ్దుతుల్లా, రవి నాయుడు, నబి, రసూల్, దేశాయ్ నజీర్, అహ్మద్ మురళి నాగేంద్రమ్మ వెంకటలక్ష్మి, అరుణమ్మ పాల్గొన్నారు.

శక్తి-వన్ స్టాఫ్ సెంటర్ పట్ల అవగాహన

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మహిళా సాధికారిక శాఖ కో- ఆర్డినేటర్ - ఎస్. చిట్టెమ్మ ఆధ్వర్యంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖలోని " శక్తి- వన్ సాఫ్ సెంటర్ స్కీమ్ "గురించి విద్యార్థినులకు చైతన్యం కల్పించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఐసిడిఎస్ వన్ స్టాఫ్ సెంటర్ నుండి కౌన్సిలర్ అయిన కరిష్మా, పారామెడికల్ విభాగానికి సంబంధించి రమా జ్యోతి హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థినిలను, మహిళలను, పిల్లల అభివృద్ధిని వేగవంతం చెసే, లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వన్ స్టాఫ్ సెంటర్ల ను దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేశారని తెలిపారు. మహిళలపై జరిగే వేధింపులు, స్త్రీ వివక్ష నుంచి రక్షణ కల్పించేందుకు కృషి చేయడం, గృహ హింస, పని చేసే ప్రాంతాల్లో మహిళలు వేధింపులకు గురి అంతే సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించడం, 18లోపు వయసున్న బాలికలు18 ఏళ్ళ కంటే ఎక్కువ వయసున్న మహిళలు ఎదుర్కొం టున్న ఇబ్బందులను బట్టి అవసరమైన సహకారాన్ని అందించడం, బాధితులకు 5 రోజుల పాటు తాత్కాలిక వసతి ఏర్పాటు చేయడం, వసతి పొందిన రోజుల్లో అవసరమైన ఆహారాన్ని, మందులు, ఇతర సౌకర్యాలను ఉచితంగా కల్పించడం వంటి అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారిక విభాగం కో- ఆర్డినేటర్ డా. ఎస్ చిట్టెమ్మ, డా.బి .త్రివేణి ఎస్ .షమీఉల్లా , డా.బి.గోపాల్ నాయక్, ఎ.కిరణకుమార్ పాల్గొన్నారు. .

ట్రెజరీ అధికారుల వారి నిర్ణయంపై నిరసన

విశాలాంధ్ర-ధర్మవరం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆర్టీసీ ఉద్యోగుల నెలవారి జీతంలో రావలసిన అలవెన్సును ట్రెజరీ అధికారులు నిలుపదల చేసినందుకు నిరసనగా డిపోలో ఉదయం నల్ల బ్యాడ్జీలు ధరించి సిబ్బంది విధులకు హాజరయ్యారు. జోనల్ నాయకులు ప్రేమ్ కుమార్ రీజినల్ చైర్మన్ ముత్యాలప్ప మాట్లాడుతూ ట్రెజరీ వారు అన్ని అరియర్సు కలపాలని కోరినా స్పందన లేకపోవడం దారుణం అన్నారు. కండక్టర్లు డ్రైవర్లకు నైట్ అలవెన్స్ పునరుద్దించాలని, జీవో నెంబర్ 114లోని అలవెన్సును అమలు చేయాలని, పీటీడీ వేతన బకాయిలు ఆరియర్స్‌గా చెల్లించాలని, పిటిడి రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాజిటీ, ఆర్జిత లీవుల బకాయిలను చెల్లించాలని, అర్హులైన వారికి ఏఏఎస్ లు, ఇంక్రిమెంట్ అరియర్స్ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో చైర్మన్‌ను కార్యదర్శి హనుమాన్, మధు, గ్యారేజీ అధ్యక్ష కార్యదర్శులు కుమార్, హరి, సీనియర్ నాయకులు ఎస్ఎం షాబ్,పిఎస్ కాన్, వైయస్సార్ రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

పల్లె ఉమా సేవలు మరుపురానివి

విశాలాంధ్ర-ధర్మవరం: బాలాజీ విద్యాసంస్థల మాజీ చైర్మన్ కీర్తిశేషులు పల్లె ఉమా సేవలు మరుపురానివని శ్రీనివాస డిగ్రీ కళాశాల పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ముసలిరెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఉమా ఆరవ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ముసలి రెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు ఉమా ఎన్నో ప్రజా సేవా కార్యక్రమాలను చేపట్టి పేదలను ఆదుకున్నారని గుర్తు చేసుకున్నారు. గోట్లురు గ్రామంలో గల అనాధశ్రమంలో వృద్ధులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త చెరువులో ..

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్త చెరువులోనే ధర్మవరం రోడ్డులో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సతీమణి కీర్తిశేషులు పల్లె ఉమా, ఆరవ వర్ధంతిని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ ప్రజలకు విద్యాసంస్థల నిర్వహణకు ఆమె ఎనలేని కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు రఘుపతి, సూర్య ప్రకాష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 31, ఆగస్టు 2024

బాధ్యతగా ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలి-ఎమ్మెల్యే పరిటాల

విశాలాంధ్ర-రాప్తాడు : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని బాధ్యతగా పెంచాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. రామగిరి మండలం ఎంజేపీ బాలికల పాఠశాలలో డ్వామా, అటవీ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా వంటి కరవు ప్రాంతంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. మన ప్రాంతంలో అటవీ విస్తీర్ణం చాలా తక్కువగా ఉన్నందువలన వర్షాలు కూడా సరిగా కురవడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మొక్కలు నాటాల్సిన అవసరం చాలా ఉందని అభిప్రాయపడ్డారు. చాలామంది మొక్కలు నాటడంతో తమ పని అయిపోయిందని భావిస్తారని కానీ... మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు ప్రజలు, సామాజిక వేత్తలు కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి పట్టణంలో ఎంతో మంది పేదవారు నివసిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో నిత్యవసర, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పేదవాడి జీవన విధానం, సంపాదనలో మాత్రం ఏ మార్పు రాలేదు. ఎందుకంటే ఒక మనిషి తన కుటుంబాన్ని పోషించుకోవాలంటే ప్రస్తుత కాలంలో దాదాపు 20వేల రూపాయల వరకు అవసరం అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పేదవాడికి అనారోగ్య పరిస్థితి ఏర్పడి, బ్లడ్ అవసరం పడి ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ లో కొనుగోలు చేయాలంటే, బ్లడ్ ఒక యూనిట్ తీసుకోవాలన్న దాదాపు 1600 రూపాయల వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో కొంత మంది పేద ప్రజలు ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ లో ఒక యూనిట్ కోసం డబ్బులు చెల్లించే పరిస్థితిలో లేరు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రక్తం కావాలన్నా కూడా అనంతపురంకి వెళ్లి శాంపుల్ తీసుకొని, రక్తం తీసుకొని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతపురం నుంచి తాడిపత్రికి రావడానికి ఒక గంట 30 నిమిషాలు పడుతుంది. ఈ మధ్యలో రోగులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సమయాలలో ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేయాలి, బ్లడ్ బ్యాంకుకు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానిక పేద ప్రజలు, సామాజిక వేత్తలు కోరుతున్నారు.

పాత పెన్షన్ విధానమే అమలు చేయాలి

విశాలాంధ్ర-ధర్మవరం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యుపిఎస్), గ్యారెంటీ పెన్షన్ స్కీమ్(జిపిఎస్), కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) వీటిని రద్దుచేసి పాత పెన్షన్ విధానం(ఓపిఎస్) మాత్రమే అమలు చేయాలని యుటిఎఫ్ శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి స్థానిక ధర్మవరం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ధర్మవరం డివిజన్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం మాత్రమే అమలు చేయాలని, పెన్షన్ బిక్ష కాదు అది ఉద్యోగుల హక్కు అని గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పాలకపక్షాలు అనుసరించి, అందరికీ ఆమోదకరమైన పాత పెన్షన్ విధానం మాత్రమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ తీసుకొని రావడం దారుణమని ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించాలని, అలాగే రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయకుండా 117 జీవోను రద్దు చేయకుండా వర్క్ అడ్జస్ట్మెంట్ మండల స్థాయిలో కాకుండా డివిజన్ జిల్లా స్థాయిలో నిర్వహించడం తగదని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శన అనంతరం ధర్మవరం రెవెన్యూ అధికారి ఎమ్మార్వో నటరాజ్ యుటిఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, లక్ష్మయ్య, ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, హరికృష్ణ, సాయి గణేష్, రాంప్రసాద్, సకల చంద్రశేఖర్, బిల్లె రామాంజినేయులు, బి. ఆంజనేయులు, జనార్ధన్ బాబు, కృష్ణతేజ, బాలాజీ, నారాయణ స్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉదిరిపి కొండలో పొలంబడి

విశాలాంధ్ర-కూడేరు: ఉదిరిపికొండలో మహిళా రైతు దాసరి లక్ష్మి దేవి కి చెందిన వేరుశేనగ పొలంలో శుక్రవారం మండల వ్యవసాయ శాఖ మరియు కార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండి గ్యాప్ పొలం బడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పంటలను మేలైన సాగు యాజమాన్య పద్ధతులతో, పర్యావరణ హితమైన, అధిక దిగుబడులతో పాటు హానికారక అవశేషాలు లేని ఫలసాయాన్ని పొందే వివిధ ప్రక్రియలను ఈ ఇండి గాప్ పొలం బడి ద్వారా తెలుసుకొనటమే కాకుండా ప్రత్యక్షంగా చేసి తెలిసికొనడానికి వీలు కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ ఉదిరిపికొండ గ్రామ పొలంబడి రైతు లకు తెలియ చేసారు. తరువాత కార్డు స్వచ్ఛంద సంస్థ వారు 5 మంది రైతులను ఈ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు అంగీకారం తెలుపగా వారితో అగ్రిమెంట్ చేయించడం జరిగింది.

వైభవంగా ఆది చెన్నకేశవుడి రథోత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ: కొనకొండ్లలో వెలిసిన శ్రీ ఆది చెన్నకేశవ స్వామి రథోత్సవం శుక్రవారం వైభవోపేతంగా సాగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ శివరామరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా తమ గ్రామంలో నిర్వహించే శ్రీ ఆది చెన్నకేశవస్వామి రథోత్సవంఎంతో ప్రాముఖ్యత గాంచి, గ్రామ ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో , కలిసిమెలిసి జీవించాలని అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో చెన్నకేశవ స్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆస్వామి చల్లని దీవెనలు అందరికీ అందాలని మనస్ఫూర్తిగా వేడుకున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

పింఛన్లు ప్రతి ఒక్కరికి ఇంటి వద్దనే అందాలి-అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

విశాలాంధ్ర-అనంతపురం: ప్రతి ఒక్క లబ్ధిదారునికి శనివారం ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని ఆయన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేస్తోందని అయితే ఈసారి ఒకటవ తేదీ ఆదివారం రావడంతో ఒక్కరోజు ముందుగా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శనివారం రోజు జరగబోయే పింఛన్ల పంపిణీలో మొత్తం సచివాలయ సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇంటి వద్దకే వెళ్లి ఉదయాన్నే పింఛన్ అందించాలని సూచించారు. శనివారం రోజు పింఛన్ తీసుకొని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారికి కచ్చితంగా సోమవారం ఇంటి వద్దకే వచ్చి అందిస్తారని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలియజేశారు. పార్టీ శ్రేణులు అంతా తమ డివిజన్ల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని దగ్గుపాటి ఆదేశించారు. ఇప్పటి వరకు వరుసగా రెండుసార్లు తొలి రెండు రోజుల్లోనే 100% పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్లు పెంచి మరి ఇంటి వద్దకే చేరుస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

పల్లె ఉమా సేవలు చిరస్మయం

విశాలాంధ్ర-బుక్కపట్నం: మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి, పల్లె ఉమా చేసిన సేవలు చిరస్మ నియమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పల్లె ఉమా ఆరోవర్ధంతి పురస్కరించుకొని మండల కేంద్రంలో ఉమా చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక అంగన్వాడీ, ప్రాథమికఆరోగ్య కేంద్రాల్లో మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో బ్రెడ్లు, పాలు,బిస్కెట్లు,పంపిణీ చేశారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పల్లె ఉమాచేసిన సేవలు చిరస్మనేమని, పీవీ కేకే విద్యాసంస్థల ద్వారా ఎంతోమంది విద్యార్థులకు సేవలందించారని, రాజకీయంగా ఎంతో సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మలిరెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్ సాకే యశోద, సుబ్బారెడ్డి,మాజీ ఎంపీపీ బాలు, వెంకట రాముడు లావణ్య గౌడ్, మంజు, సుధీర్, సతీష్,తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం..!

విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్: కలుషితమైన వాతావరణాన్ని అధికమించడానికి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే బాలయ్య కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు, చిలమత్తూరు మండల పరిధిలోని టేకులోడు గురుకుల పాఠశాలలో శుక్రవారం టీడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ జయసింహ నాయుడు పిలుపుమేరకు కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు విచ్చేసి కూటమి నాయకులు, విద్యార్థినీలతో కలిసి విరివిగా మొక్కలు నాటి వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో విద్యార్థినీలు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు నాటారు. ఇదే తంతుగా మండలంలోని ప్రతి పంచాయతీ గ్రామాలలో విరివిగా చెట్లు నాటాలని ఆయన తెలిపారు ,అనంతరం టేకులోడు గురుకుల పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం లేనందున విద్యార్థినీలకు పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయడంతో వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి నిర్మాణం చేపట్టేలా చూస్తామన్నారు, అనంతరం బాలయ్య 50 వసంతాలు చిత్ర సీమలో పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పాఠశాలలోని విద్యార్థినిలకు విద్యతోపాటు క్రీడల్లో రాణించిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.

నేడు ఇంటి వద్దకే సామాజిక పింఛన్ పంపిణీ

విశాలాంధ్ర-యాడికి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక పింఛన్ పంపిణీ సెప్టెంబర్ ఒకటవ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందే పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు తెలిపారు. యాడికి మండల వ్యాప్తంగా 137 మంది సచివాలయ ఉద్యోగులచే 7949 పింఛన్లు రూ.3.51 కోట్లు పంపిణీ చేస్తారని తెలిపారు. 31వ తేదీ పింఛన్‌లు అందు కోని వారు రెండోతేదీ పొందవచ్చు అన్నారు. సచివాలయ ఉద్యోగులు నేడు ఉదయం 6 గంటలకు లబ్ధిదారుల ఇంటి వద్దకు వచ్చి పింఛన్ పంపిణీ చేస్తారని కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగిం చుకోవాలన్నారు.

వారానికి ఒకసారి డ్రై డే పాటిద్దాం..!

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాల్ గ్రామం లోబీసీ కాలనీ లో శుక్రవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే పైన అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ప్రతి శుక్రవారం పాత్రలు, నీటి డ్రమ్ములు, కూలర్ లోని నీళ్ళు, పారాబోసి ఒక గంట ఆరబెట్టి, నీళ్ల పట్టుకోవాలని సూచించారు. దోమలు వల్ల వచ్చే మలేరియా, డెంగీ, చికున్ గున్య వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రజలకు వివరించారు. నీళ్ళు కాంచి చల్లార్చి తాగాలని సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో హెచ్ స్ రుక్మిణి, సి హెచ్ ఓ నాగమని, హెచ్ స్ జైనుబీ ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్, ఆశ వర్కర్స్ ,ఈరమ్మ ,లక్ష్మి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లె ఉమా వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్త చెరువులోనే ధర్మవరం రోడ్డులో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సతీమణి కీర్తిశేషులు పల్లె ఉమా, ఆరవ వర్ధంతి వేడుకలను టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను వారు కొనియాడారు. నియోజకవర్గ ప్రజలకు విద్యాసంస్థల నిర్వహణకు ఆమె ఎనలేని కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు రఘుపతి, సూర్య ప్రకాష్, సుబ్రహ్మణ్యం ,మాధవి, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లపై అవగాహన తప్పనిసరి

విశాలాంధ్ర-రొళ్ల: మండల కేంద్రం లోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు స్కూల్ కమిటీ చైర్మన్ లకు వైస్ చైర్మన్ లకు శుక్రవారం ఎంఈఓ శ్రీధర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు ముఖ్యంగా ఐ.ఎం.ఎం.ఎస్ యాప్ నందు ఇన్స్పెక్షన్ చేయు విషయంపై,ఫోటో కాప్చరింగ్ ఎలా చేయాలి ఏ వారం ఎవరు కాప్చరింగ్ చెయ్యాలి అనే విషయం పై ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు వారంలో సోమవారం మరియు గురువారం రెండు రోజులు మరుగు దొడ్ల ఫోటో కాప్చర్ చేసి ఇన్స్పెక్షన్ ఫారం నందు సబ్మిట్ చేయాలని మరియు అదేవిధంగా ఎస్.ఎం.సి సభ్యులు వారంలో బుధవారం మరియు శుక్రవారం రెండు రోజులు మరుగుదొడ్ల ఫోటో కాప్చర్ చేసి ఇన్స్పెక్షన్ ఫారం సబ్మిట్ చేయాలన్నారు.ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,ఎస్ఎంసీ చైర్మన్ లు,వైస్ చైర్మన్లు,విద్యా వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు మాయం-తహసీల్దార్ కార్యాలయానికి తాళం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ తాహసిల్దార్ కార్యాలయంలో రికార్డులు తరమారు చేశారని మండల పరిధిలోని వెంకటరెడ్డి పల్లికి చెందిన రమేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాహసిల్దారు కలవడానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశాడు. బాధితులు మాట్లాడుతూ రెవిన్యూ కోర్టులో వివాదం ఉన్న భూమి డాక్యుమెంట్ రికార్డ్ మాయం చేసి దళితల భూమి నీ అగ్రవర్ణ కులం చెందిన వారికి పట్టా చేసిన వీఆర్వో గంగన్నను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పెనుకొండ మండల తాహసిల్దార్ కార్యాలయంలో ఉన్న సిబ్బందిని బయటకు పంపించి తలుపులు వేసి నిరసన వ్యక్తం చేశాడు. దళిత కుటుంబానికి చెందిన రమేష్ భూమికి సంబంధించి పెనుకొండ రెవిన్యూపొలం సర్వేనెంబర్ 1121-12 నందు 1 - 94 సెంట్లు ఉంది. అంజినప్ప ,సీనప్ప, పెద్దన్న ,ముత్యాలప్ప నలుగురికి సంబంధించినటువంటి భూమి పై రెవెన్యూ కోర్టులో కేసు నడుస్తున్నది. భూమికి సంబంధించినటువంటి ఫైల్ మాయం చేసి దళితులకు సంబంధించిన భూమిని అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ కులానికి చెందిన శివప్ప అనే వ్యక్తికి పట్టా ఇచ్చిన వీఆర్వో గంగన్న ని వెంటనే సస్పెండ్ చేయాలని మా ఫైల్ ఇచ్చేంతవరకు లేచే ప్రసక్తి లేదని తాహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయడం జరిగింది వెంటనే పోలీసులు వచ్చి రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఒక గంటలో ఫైలు రికార్డు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించడం జరిగింది.

పొలాల సరిహద్దుల్లో నాటేందుకు మొక్కలు పంపిణీ

విశాలాంధ్ర-ఉరవకొండ: ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు తగ్గించడానికి మరియు పర్యావరణం పరిరక్షణకు, రైతులకు అదనపు ఆదాయం రావటంకోసం, వర్షాకాలం మొదలైనప్పటి నుంచి రైతుల పొలాల సరిహద్దులలో నాటుకోవడానికి ఉచితంగా మహా గని,ఎర్రచందనం, టేకుమొక్కులను అందిస్తున్నట్లు జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు తెలిపారు. శుక్రవారం ఉరవకొండలో ఆయన రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు పదివేల మొక్కలను అందించామని పేర్కొన్నారు. మొక్కలు పంపిణీ చేసేందుకు సహకరించిన ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మరియు పిరమిడ్ ధ్యాన మాస్టర్ హనుమంత్ కు నాగమల్లి ఓబులేసు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ డైరెక్టర్ నాగమల్లి అక్రాంత్ ఋషి, నాగార్జున్, ఆదర్శ రైతు రాజేష్ నాయక్, నాగరాజు మరియు రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని పురుగు మందుల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి మహబూబ్ బాషా శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం పురుగు మందుల రికార్డులు ,పురుగు మందుల నిల్వలు తనిఖీ చేసి ప్రభుత్వం ఆమోదించిన కంపెనీల నుండి తెచ్చుకుంటున్నారా లేదా అని పరిశీలించారు. అదేవిధంగా డీలర్లు రైతులకు సరియిన. ధరకే అమ్మకాలు జరుగుతున్నాయ లేదా అని బిల్లు బుక్కులను తనిఖీ చేశారు,రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాల్సిందేనని అట్లు కానీ యెడల చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. పవన్ ఫెర్టిలేజర్స్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఫెర్టిలైజర్స్ దుకాణాలలో కొన్ని ఉత్పత్తులను నాణ్యత పరీక్ష నిమిత్తం రీజినల్ కోడింగ్ సెంటర్ - తిరుపతి కి పంపినట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలిపారు.

క్రీడా సామాగ్రిని అందజేత

విశాలాంధ్ర-రొళ్ల: దొమ్మర హట్టి సమీపంలోని డా.బి. ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆటవస్తువులు లేకుండా పిఈటి పీరియడ్లలో క్రీడల పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులు నిరుత్సాహంగా ఉండేవారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ మైలారప్ప క్రీడా సామాగ్రి దాతులను వెతుకుతున్న నేపథ్యంలో అందుకు పాఠశాల కమిటీ చైర్మన్ సుమ జగన్నాథ్ స్పందించి 10,000 రూపాయలు విలువ చేస్తున్న ఆట సామాగ్రిని అటవీశాఖ అధికారుల సమక్షంలో పాఠశాల ప్రిన్సిపాల్ కు అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రీడా సామాగ్రి సద్వినియోగం చేసుకొని జిల్లా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచాలని కోరారు. వనం మనం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ సుమ జగన్నాథ్, వైస్ చైర్మన్ వన్నూర్ స్వామి, ఏపిఓ ఓబుళప్ప, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుళ్లాయప్ప, సంజీవరాయప్ప, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు..

పెద్దపీటలో జాతీయ నేత్రదానపక్షోత్సవాలు

విశాలాంధ్ర-యాడికి: పెద్దపీటలో శుక్రవారం తాడిపత్రి డివిజన్ జిపియంవోవో మధు సూదనరాజు 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మేరకు నేత్రదాన అవగాహనా కార్య క్రమాన్ని నిర్వహించారు.అనంతరం యంపి యూపి స్కూల్‌లో 71మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఐదుగురు విద్యార్థులకు కంటి అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. వారికి త్వరలో ఉచితంగా కంటి అద్దాలు అందచేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు ఏ.రంగేశ్వరయ్య, ఉపాధ్యాయులు యన్. నాగరాజు, కే.రాజేశ్వరీ బాయ్,ఏ.జయలక్ష్మి, జే.అరుణాబాయ్, వై.ప్రమీల, యస్.వరలక్ష్మి, డి.నవనీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

విశాలాంధ్ర-అనంతపురం: సమాజంలోని ప్రతిఒక్కరూ హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కలిగి, ఇతరులకు అవగాహన కల్పించాలని ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ రాజు పేర్కొన్నారు. నగరంలోని ఎస్ఎస్‌బి ఎన్ డిగ్రీ కళాశాలలో ఝాన్సీ లక్ష్మి కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్, సిసి 2.0 ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ రాజు వృక్ష రాజ్యం హెచ్ ఓ డి మాధవి, ఝాన్సీ లక్ష్మి సిబిఓ పీడీ నాగమణి,, కోఆర్డినేటర్ భారతి, జంతుశాచుల ఉపన్యాసకులు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మన పాఠ్యాంశాలలో ఉన్న హెచ్ఐవి ఎయిడ్స్ విషయాలపై అవగాహన కలిగించుకొని గ్రామీణ ప్రాంతాల్లో అవగాహనలు కల్పించాలన్నారు. వృక్షశాస్త్ర ఉపన్యాసకులు మాధవి మాట్లాడుతూ...వ్యాధి సోకిన వారికి అధైర్య పరచకుండా జీవితకాలం ఎలా పెంచుకోవాలా అనేటువంటివి అవగాహన కల్పించాలన్నారు. పీడీ నాగమణి మాట్లాడుతూ.. 2004 నుండి హెచ్ఐవి వారికి ఎన్నో సేవలు చేస్తూ, చనిపోయిన వారికి అంత్యక్రియలు చేయడం జరిగిందన్నారు. సోషల్ మీడియాలో ఎక్కువగా ప్రభావం కాకుండా జీవితాన్ని సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ భారతి కళాశాల సిబ్బంది, సంస్థ సభ్యులు పద్మావతి, మహేష్, జయలక్ష్మి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు మురికి కాలువలలోకి చేప పిల్లలు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా 20వేలు గంబుషియా చాప పిల్లలను మురికి కుంటలలో దోమ లార్వాలను నశింప చేయడానికి వదిలారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం భాగంగా ఉరవకొండ తాసిల్దార్ మహబూబ్ బాషా, ఉరవకొండ డివిజన్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి, తదితరులు ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ కూడా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు ఇళ్ల వద్ద మురికి నీరు నిలువ ఉంచకుండా చూడాలని ఇళ్లల్లో కూడా ఎక్కువ రోజులు నీటి నిలువ ఉన్న పాత్రలను వారానికి ఒకసారి శుభ్రం చేసి ఎండ బెట్టాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం ఏవో జయరాములు, గ్రామ కార్యదర్శి గౌస్ సాహెబ్, మెడికల్ ఆఫీసర్ వినీత, సచివాలయ, గ్రామపంచాయతీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నహోబిలంలో ఉట్ల పండగ

విశాలాంధ్ర-ఉరవకొండ: పెన్నహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో ఉట్ల పండగ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగించారు. అనంతరం ఒకరిపై ఒకరు ఎక్కుతూ ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్ కుమార్ తో పాటు ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై సమీక్ష

విశాలాంధ్ర-తాడిపత్రి: 30వ వార్డు సచివాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బందితో 30 వార్డ్ కౌన్సిలర్ మల్లికార్జున సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని అండర్ డ్రైనేజీ, చెత్త సేకరణ, వీధి దీపాలు పలు సమస్యల గురించి చర్చించారు. ముఖ్యంగా 31వ తేదీ ఎన్టీఆర్ పింఛన్ పంపిణీ త్వరగా పూర్తిచేయాలని వార్డ్ సెక్రెటరీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాల సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుల నైపుణ్యాలే విద్యార్థులకు వెలుగు

విశాలాంధ్ర -జెఎన్టియుఏ: అధ్యాపకుల నైపుణ్యాలే.. విద్యార్థులకు వెలుగని రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య పేర్కొన్నారు. జే ఎన్టీయూ మెకానికల్ విభాగంలో అధ్యాపకులకు శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. మెకానికల్ విభాగాధిపతి కె. కళ్యాణి రాధా , ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా బి. ఓం ప్రకాశ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య బోధనతో సులువైన రీతిలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పరిశోధనాత్మక అధ్యాయం, పాఠ్యాంశాల అన్వేషణ నిరంతరం చేపట్టాలని సూచించారు.